క్లుప్తంగా

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : శ్రీరామచంద్రమూర్తి జీవించిన విధానాన్ని అందరికీ అర్థమయ్యేలా రచించిన గొప్పవ్యక్తి వాల్మీకి మహర్షి అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో గురువారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వై.ప్రదీప్‌రెడ్డి ముందుగా వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధికారప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దర్గాలో ఫాతెహాలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

అన్నదానానికి విరాళం



దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానానికి గురువారం ఆదోని వాస్తవ్యులైన సుజాత, సుందర్‌రాజు వారి కుంటుంబ సభ్యులు రూ.50,101వేల నగదు రూపంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని డీసీ విజయరాజు కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శివపుత్రస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించండి

ఆదోని రూరల్: పట్టణంలోని ప్రకాష్‌నగర్, కల్లుబావి హైస్కూల్‌లో తరగతి గదులను పెంచి, ఉపాధ్యాయులను నియమించాలని సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, పట్టణ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, నాయకులు మల్లయ్య కోరారు. గురువారం వారు పాఠశాలలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎలిమెంటరీ స్కూలును హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. అయితే స్థాయి పెరిగినా గదుల సంఖ్య పెరగలేదన్నారు. దీంతో ఒక్కో గదిలో సుమారు 90 మంది వరకు విద్యార్థులు ఉండే పరిస్థితి ఉందన్నారు.

ఎస్సీఎస్టీ కేసులో జైలు శిక్ష

కౌతాళం: ఎస్సీ ఎస్టీ కేసులో ముద్దాయిలకు నాలుగేళ్ల జైలు శిక్ష పడినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. 2018వ సంవత్సరంలో మండల పరిధిలోని కుంబళనూరు గ్రామంలో మాదిగ మారెప్పను కులం పేరుతో దూషించి కొట్టారని అప్పట్లో సత్యనారాయణ, సతీష్‌కుమార్‌లపై కేసు నమోదయ్యింది. కులం పేరుతో దూషించినట్లు రుజువుకావడంతో గురువారం కర్నూలు ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జి శ్రీవాసు ఒక్కొక్కరికి 4 సంవత్సరాల శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఈనాంపై అవగాహన



వేరుశనగ రాశిని పరిశీలిస్తున్న ఈనాం బృందం

ఆదోని అర్బన్: వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈనాంపై కమిషన్ ఏజెంట్లకు, వ్యాపారస్తులకు గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్, సెకన్ గ్రేడ్ సెక్రటరీ కల్పన ఆధ్వర్యంలో ఈనాం ఢిల్లీ బృందం అవగాహన కల్పించింది. రైతులు తెచ్చిన దిగుబడులు రైతులే రిజిస్ట్రేషన్ చేసుకుని ఐడీ పొందాలన్నారు. అనంతరం ఈనాం ఢిల్లీ బృందం యార్డు అధికారులతో వ్యవసాయ మార్కెట్ యార్డులో కలియతిరిగి పరిశీలించారు. సమావేశంలో యార్డు సహాయ కార్యదర్శి కాంత కుమార్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఆదోని అర్బన్: పోలీసులపై దాడి చేసి, వారి విధులకు ఆటంకం కలిగించిన పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ గురువారం తెలిపారు. గురువారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తుండగా రమేష్ పోలీసులపై దాడి చేసి వారి విధులకు ఆటంకం కలిగించాడన్నారు.

గుడిసెల తొలగింపు అన్యాయం

- ఆలూరు రోడ్డులో పేదల పాకల తొలగింపుపై మున్సిపల్ కౌన్సిల్‌లో రచ్చ
- వంద అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ గుడిసెలు ఎందుకు తొలగించారని కౌన్సిలర్ల నిలదీత
- పాలకవర్గ సభ్యులకు సమాచారమే ఇవ్వలేదని ఆగ్రహం



చైర్‌పర్సన్ లోకేశ్వరి ప్రశ్నలకు సమాధానం చెబుతున్న కమిషనర్

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని ఆలూరు రోడ్డులో వంద అడుగుల రోడ్డు విస్తారంగా ఉన్నప్పటికీ పేదల గుడిసెలను ఎందుకు తొలగించారని మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు అధికారులను నిలదీశారు. గుడిసెలను తొలగించడం అన్యాయమని, వంద పాకలను పీకేసి పేదలను వీధి పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆదోని మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ లోకేశ్వరి అధ్యక్షతన జరిగింది. గుడిసెల తొలగింపుకు పాలకవర్గ సభ్యులకు సమాచారమే లేదని, కౌన్సిల్ దృష్టికి తీసుకురాకుండా ఎలా తొలగించారని వైస్ చైర్మన్ అధికారులను నిలదీశారు. పట్టణంలో ప్రధాన రోడ్డు, సందులు, మెయిన్ బజార్లలో అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటిని తొలగింపులో లేని అత్యుత్సాహం పేదల గుడిసెలపై ఎందుకంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. అసలు ఫిర్యాదు ఎవరు చేశారు, కౌన్సిల్ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే కార్యక్రమంలో భాగంగానే గుడిసెలను తొలగించడం జరిగిందని, ఇందులో ఎవరి ప్రమేయం ఏమీలేదని కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి సమాధానంగా చెప్పారు. ఇక మీదట పట్టణంలో ఎక్కడైనా అక్రమ కట్టడాల పేరుతో పేదల గుడిసెలు తొలగించరాదని, తప్పనిసరి అయితే కౌన్సిల్ ఆమోదంతోనే తొలగించాలని, లేనిపక్షంలో అధికారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని వైస్ చైర్మన్ హెచ్చరించారు.

ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతు పనులు ప్రారంభించాలి

బసాపురం ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతు పనులు త్వరగా ప్రారంభించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, బాలాజీయాదవ్, రఘునాథ్‌రెడ్డి అధికారులను కోరారు. ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతు పనులకు రూ.42 కోట్లు చాలవని, అదనపు నిధులు మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. పట్టణ అభివృద్ధికి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అడ్డుకాదని, అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని సభ్యులు చెప్పారు.

ఆపరేషన్లు చేసిన కుక్కల సంతతి ఎందుకు పెరిగింది

మున్సిపాలిటీలో 42 వార్డుల పరిధిలో కుక్కల సంతతి పెరగకుండా ఆపరేషన్లు చేశారని, అయినా కుక్కల సంతతి విపరీతంగా పెరిగిందని వైస్ చైర్మన్లు అబ్దుల్‌గౌస్, నరసింహులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆపరేషన్లు ఫెయిల్యూర్ అయ్యాయా లేక కుక్కల పట్టివేత కార్యక్రమంలో కొన్ని కుక్కలు తప్పించుకోవడం వల్లనే సంతతి పెరిగిందా అన్న దానిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌జీవోస్ కాలనీలో కుక్కల బెడద తీవ్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఎంఈ సత్యనారాయణ, తహసీల్దార్ రమేష్, డీఈలు, ఏఈలు, అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్‌లో వాదోపవాదాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ కౌన్సిలర్లు, (ఇన్‌సెట్)కౌన్సిలర్లను వారిస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

- వైఎస్సార్‌సీపీ, బీజేపీ, టీడీపీ కౌన్సిలర్ల వాగ్వాదం
- కుర్చీ ఏర్పాటుపై కూటమి కౌన్సిలర్ల కుమ్ములాట
- సోమప్ప సర్కిల్ పేరు మార్పు వద్దన్న కౌన్సిలర్లు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్, ఇటీవల టీడీపీని వీడి బీజేపీలో చేరిన 21వ వార్డు కౌన్సిలర్ మధ్య వాగ్వాదంతో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. గురువారం చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ, పార్టీలు ఫిరాయించి బీజేపీ, టీడీపీలలో చేరిన కౌన్సిలర్లతో సభ ఎవరిగోల వారిదే అన్నట్లు మారిపోయింది. దీంతో చివరికి సభా అధ్యక్షుడైన చైర్మన్ తన సీటు నుంచి లేచి వచ్చి అన్ని పక్షాలను సముదాయించినా.. వారి మధ్య వాగ్వాదం సద్దుమణగలేదు. కాసేపటికి చైర్మన్ అగ్రహించడంతో సభ్యులు మిన్నకుండిపోయారు. ఇటీవల బీజేపీలో చేరిన 21వ వార్డు కౌన్సిలర్ దయాసాగర్ పట్టణంలోని అన్ని వార్డుల సమస్యలను పేర్కొంటూ సమయం ఎక్కువ తీసుకోవడంతో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ డిష్ కేశవ రెడ్డి అభ్యంతరం తెలిపారు. ఇతరులకు సమయం ఇవ్వండి.. మీ వార్డు సమస్యలు మాత్రమే చెప్పండి' అనడంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగాయి.

సోమప్ప సర్కిల్ పేరును చెరిపేయొద్దు

పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో జాతీయ జెండాను ఏర్పాటు చేసి పద్మశ్రీ మాచాని సోమప్ప సర్కిల్ పేరును చెరిపివేయవద్దని జాతీయ జెండాను తాము గౌరవిస్తామని అందువలన మరేదైనా సర్కిల్‌లో ఏర్పాటు చేయండని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కామర్తి నాగేషప్ప, శివప్రసాద్, డిష్‌కేశవరెడ్డి, బజారి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన చైర్మన్ కమిషనర్‌కు ప్రశ్నించగా సభ్యుల వినతి మేరకు శివసర్కిల్‌లో జాతీయ జెండా ఏర్పాటు చేస్తామని సమాధానం ఇచ్చారు. అనంతరం పలువురు సభ్యులు తమ వార్డు పరిధిలోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో కౌన్సిల్ అజెండాలోని 28 అంశాల్లో 16వ, 17వ అంశాలను వాయిదా వేస్తున్నామని మిగిలిన వాటిని తీర్మానిస్తున్నామని వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పేర్కొనడంతో సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

కౌన్సిల్‌లో సీటు ఏర్పాటుపై కూటమి కుమ్ములాట

టీడీపీ నుంచి బీజేపీలో చేరిన 21వ వార్డు కౌన్సిలర్ దయాసాగర్‌కు మా పక్కలో కుర్చీ కేటాయించవద్దని, ఆయనకు ప్రత్యేకంగా వేరే చోట సీటు వేయండని టీడీపీ కౌన్సిలర్లు ఇషాక్, అమాన్ తదితరులు కౌన్సిల్‌లో చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో దయాసాగర్ వారితో వాగ్వాదానికి దిగారు. ఇలా ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు, వాగ్వాదంతో సభ గందరగోళంగా మారింది. ఇరు పక్షాల మధ్య వాగ్వాదం ముదరడంతో చైర్మన్ వారిని వారించారు. కాగా, టీడీపీ నుంచి బీజేపీలో చేరిన దయాసాగర్‌కు కుర్చీ మా పక్కన వేయవద్దు వేరే చోట కేటాయించాలని డిమాండ్ చేసిన కౌన్సిలర్లు కూడా వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన వారే కావడం గమనార్హం. సమావేశంలో డీఈలు నీరజ, రాజునాయక్, ఆర్ఓ అస్లాంబాషా, టీపీఓ రాజేష్, ఏఈలు శరత్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుతో మమేకం కార్యక్రమంలో జేడీఏ



ధణాపురంలో రైతు ధనుంజయ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జేడీఏ వరలక్ష్మి

ఆదోని రూరల్: మండలంలోని ధణాపురం గ్రామానికి చెందిన రైతు ధనుంజయ కుటుంబాన్ని వ్యవసాయశాఖ జేడీఏ వరలక్ష్మి గురువారం సందర్శించారు. 'రైతుతో మమేకం' అనే కార్యక్రమంలో భాగంగా రైతు కుటుంబాన్ని కలిసి వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు తెలియజేశారు. రైతులకు అందుబాటులో వ్యవసాయ అధికారులు ఉంటారని, వారి సలహాలను పాటించి వ్యవసాయంలో రాణించాలని సూచించారు. ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ సుధాకర్, ఏఈఓ సతీష్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు



పోస్టర్లను విడుదల చేస్తున్న పోలీసులు

ఎమ్మిగనూరురూరల్: యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాల బారినపడొద్దని కర్నూలు ఎస్ఐ సృజన్ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్‌జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై విద్యార్థులకు కర్నూలు ఈగల్ టీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసైతే జీవితం నాశనం చేసుకున్నట్లేనని చెప్పారు. వాటికి దూరంగా ఉండాలని, మీ సన్నిహితులను వాటికి దూరంగా ఉండేల చూడాలని సూచించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఎమ్మిగనూరు ఈగల్ టీమ్ సభ్యులు, రమేష్, ఏలిషా తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆదోని సెంట్రల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 2వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ మాజీ రాష్ట్ర కౌన్సిలర్ లోక్యనాయక్, ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కౌన్సిలర్ జి. వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు తెలిపారు. గురువారం పురపాలక కార్యాలయం ఆవరణలో సన్నాహక సమావేశం నిర్వహించారు. అలాగే ఎస్టీయూ సీనియర్ నాయకుడు మనపాటి సూర్యుడు, అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి. సుంకన్న ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీయూ భవనంలో ఆదోని, కౌతాళం మండలాల ముఖ్యనాయకుల సమావేశం ఆదోని ఎస్టీయూ మండల అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలపై స్పందించడం లేదన్నారు. ఇటీవల బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు రెండు నెలలు గడిచినా జీతాలు చెల్లించలేదన్నారు. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. ఈ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా జరిగే మహాధర్నాకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు కే. ప్రహ్లాద్, సుధాకర్, శ్రీరాములు, అంజినయ్య, కోటేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో కరువైన మౌలిక సదుపాయాలు





విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు, చినిగిన బ్యాగులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: సంక్షేమ హస్టళ్లలో కనీస మౌలిక సదుపాయాలు కరువై విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా వున్నాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బలరామ్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పి.ఉసేన్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఎస్సీ, బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హస్టళ్లను వారు సందర్శించారు. హాస్టల్ గదుల్లో ఫ్యాన్లు సైతం పనిచేయపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, స్నానపు గదులకు డోర్లు కూడా లేవని వారు తెలిపారు. హాస్టల్‌లో వున్న 40 మంది పిల్లలకు తల్లికి వందనం డబ్బులు పడలేదని చెప్పారు. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించడంలేదన్నారు. నాయకులు శ్రీను, విజయ్, పార్టీ నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు చాంద్‌బాషా, జశ్వంత్, షరీఫ్ పాల్గొన్నారు.

హాస్టళ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం

మంత్రాలయం రూరల్ : పేద విద్యార్థుల హాస్టళ్లపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వైఎస్సార్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు జి.మణిరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు దయ్యాల మహబూబ్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను విజిట్ చేశారు. హాస్టల్ స్థితిగతులను పరిశీలించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. హాస్టల్‌లో తాగునీటి వసతి సరిగా లేదని, పరిసరాలు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయని విద్యార్థులు చెప్పుకొచ్చారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, పెద్దకడబూరు మండల అధ్యక్షుడు రామకృష్ణ, వలంటీర్ విభాగం అధ్యక్షుడు నరసింహ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఆరాధనోత్సవ ఏర్పాట్ల పరిశీలన



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ భార్గవి

మంత్రాలయం : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి మొదటి సారిగా మంత్రాలయం విచ్చేశారు. ఈనెల 8 నుంచి రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆరాధనోత్సవాల్లో భద్రతా చర్యలు, పార్కింగ్ ప్రదేశాలు పర్యవేక్షించారు. అనంతరం తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కడ భక్తుల స్నానాలకు తీసుకున్న జాగ్రత్తలపై ఆరాతీశారు. నదిలో స్నానాలకు అనుమతి లేకుండా షవర్లతోనే భక్తులు స్నానాలు చేసేలా చూడాలని స్థానిక అధికారులకు సూచించారు. ఆమెతోపాటు సీఐ రామానుజలు, ఎస్ఐ శివాంజల్ ఉన్నారు.

హత్య కేసుపై విచారణ

కోసిగి: మండల పరిధిలోని చిన్నభూంపల్లి గ్రామంలో రామలక్ష్మిని భర్త దుద్ది నరసింహులు రోకలి బండతో తలపై కొట్టడంతో మృతిచెందిన విషయం విధితమే. గురువారం ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి చిన్న భూంపల్లి గ్రామానికి చేరుకుని సీఐ మంజునాథ్‌తో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను, గ్రామస్తులను విచారణ చేశారు. ఫోరెన్సిక్స్ అధికారులు, క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ అధికారులతో రక్తపు మరకల నమూనా సేకరించారు. హత్య కేసులో నిందితుడు నరసింహులుపై కేసు నమోదు చేసి అదుపులో తీసుకుని విచారణ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ హనుమంత రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

కౌతాళం : ప్రముఖ ఉరకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో శుక్రవారం హుండీ ఆదాయం లెక్కింపు చేపడుతున్నట్లు డిప్యూటీ కమిషనర్ విజయరాజు గురువారం తెలిపారు. స్థానిక హుండీ భవనంలో ప్రత్యేక నిఘా మధ్య హుండీ కౌంటింగ్ ఉంటుందన్నారు. శ్రావణమాసం మొదటి సోమ, గురువారాలు ముగియడంతో లెక్కిస్తున్నామన్నారు.

ఇళ్లు కేటాయించాలని వినతి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని టిడ్కో ఇళ్లను కేటాయించాలని టిడ్కో లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరికి వినతి పత్రం అందించారు. తమ పేరుపై మంజూరైన ఇళ్లకు రూ.లక్ష డిపాజిట్ చెల్లించామని, ప్రభుత్వం లోను కూడా మంజూరు చేసిందని, అయినా తమకు ఇళ్లు నేటి వరకు కేటాయించలేదన్నారు. లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తామని కమిషనర్, చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాల్సిందే

ఆదోని రూరల్: స్మార్ట్ మీటర్లను రద్దు చేయాల్సిందేనని ఏఐకేఎంఎస్ నాయకులు మల్లికార్జున, ఏఐకేఎస్ నాయకులు లింగప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్లను రద్దుపై ఆగస్టు 5న చేపట్టిన విద్యుత్ డీఈ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కోరుతూ గురువారం మండలంలోని పెద్దపెండేకల్, సాంబగల్లు, నెట్టేకల్, చిన్నపెండేకల్, బైచిగేరి తదితర గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యారంగాన్ని కాపాడుకుందాం

గోనెగండ్ల : ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందేందుకు పోరాడుదామని ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు మునిస్వామి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని నీరుగార్చి ప్రైవేట్ కార్పొరేట్ విద్యారంగాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాల నందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అన్సార్ బాషా, సమీర్, అశోక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలు పట్టని ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని సీపీఎం మండల కార్యదర్శి గోవిందు, నాయకులు లక్ష్మీనర్సయ్య, రమేష్ ఆరోపించారు. గురువారం సీపీఎం నాయకుల బృందం పట్టణంలోని ఎస్ఎస్ఎస్ జెడ్పీ హైస్కూల్, తెలుగు మెయిన్ ప్రాథమిక పాఠశాల, కటిక పేట ఉర్దూ, చంద్రయ్య కొట్టాల, పైమాలగేరి తదితర పాఠశాలల్లో సమస్యలపై సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాదన్న, నామాల రాముడు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రాజెక్టుపై శిక్షణ



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని రూరల్: డివిజన్ పరిధిలో రీ సర్వే ప్రాజెక్టు ద్వారా 62 గ్రామాల్లో జరగాల్సిన రీ సర్వే పనులపై గురువారం ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎఫ్‌పీఓఎల్ఆర్ (ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్) అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అధ్యక్షతన నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ద్వారా గ్రామాల భూ సరిహద్దులను సరి చేసి ప్రజలకు పారదర్శకమైన రికార్డులు అందించడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. శిక్షణ పొందిన అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

మోసం బాబు నైజం



చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఎన్నికల ముందు ఓట్ల కోసం మభ్యపెట్టి మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని, దీనినే కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్ కుమార్, వార్డు కౌన్సిలర్లు సంధ్యారాణి, వార్డ్ ఇన్‌చార్జ్ బోయసోమేష్, శ్రీధర్‌రెడ్డి, పామయ్య, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని 17, 18, 27, 29 వార్డుల్లో చంద్రబాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సీఎం చంద్రబాబునాయుడు ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేసిన మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అబ్రార్, వైఎస్సార్‌సీపీ పట్టణ బీసీ విభాగం అధ్యక్షుడు బోయబజారి, యువజన విభాగం అధ్యక్షుడు రాజు, జిల్లా నాయకులు విశ్వనాథ్‌రమేష్, ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పదవీ విరమణ తప్పనిది

పెద్దకడబూరు : ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిదని ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల విద్యాధికారి -1గా పని చేస్తున్న సువర్ణల సునీయం పదవీ విరమణ కార్యక్రమాన్ని ఎంఈఓ -2 రామమూర్తి ఆధ్వర్యంలో స్థానిక రైయిన్ బో పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించారు. ఎంఈఓ దంపతులను సన్మానించి కానుకను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ విజయేంద్రరెడ్డి, ఎంఈఓలు ఆంజనేయులు, మోయినుద్దీన్, మధుసూదన్, శోభారాణి, సునీల, కోమలదేవి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంఈఓను సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీవిద్య

ఉపాధ్యాయురాలికి సన్మానం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని నెహ్రూమెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన పాఠశాల సహాయకురాలు కె.లలితను హెచ్‌ఎం ఫయాజుద్దీన్ ఆధ్వర్యంలోసన్మానించారు.

సొసైటీ సీఈఓకు..

నందవరం: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈఓగా పని చేస్తున్న సుదర్శనంను పదవీవిరమణ సందర్భంగా సొసైటీ చైర్మన్ గోపాల్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ భీమశేఖర్, మహేష్, పెద్దలు కాసీం వల్లి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్‌మన్ పదవీవిరమణ

గోనెగండ్ల: స్థానిక పోస్టు ఆఫీస్‌లో పోస్ట్‌మన్‌గా పనిచేస్తున్న పోలకల్ గోపాల్ గురువారం పదవీ విరమణ పొందగా పోస్ట్ మాస్టర్ హర్షవర్ధన్, సిబ్బంది శాలువాలతో సన్మానించారు.

సంక్షిప్తం

శ్రీమఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన రాఘవేంద్ర అనే భక్తుడు దైనిక సంపూర్ణ సేవకుగానూ రూ.లక్ష రూపాయలు విరాళంగా అందజేసినట్లు మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. సదరు భక్తుడికి శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీర్వాదం చేశారు.

మేలురకం విత్తనాలతో మంచి దిగుబడులు

ఎమ్మిగనూరురూరల్: రైతులు మేలు రకం ఆముదం విత్తనాలను విత్తుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని కేవీకే సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ మదిరెపల్లి శివశంకర్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ నూనె గింజెల పథకంలో భాగంగా ఎంపిక చేసిన రైతులకు ఉచితంగా ఆముదం విత్తనాలను పంపిణీ చేశారు.

ఎంఈఓల బాధ్యతల స్వీకరణ

కోసిగి: మండల విద్యాధికారిగా బాలయ్య గురువారం ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆలూరు మండలం హులేబీడు హై స్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తూ కోసిగి ఎంఈఓగా పూర్తి బాధ్యతలు స్వీకరించారు.

పెద్దకడబూరు : పత్తికొండ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ హిందీగా పని చేస్తున్న ఉస్మాన్‌బాషా బదిలీపై పెద్దకడబూరు మండలం ఎంఈఓ -1గా (పుల్ అడిషనల్ చార్జీగా) గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సువర్ణల సునీయం గురువారం పదవీ విరమణ పొందారు.

చేనేతల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని స్థానిక చేనేత పరిరక్షణ సమితి నాయకులు శంకరన్న, నీలకంఠ, నాగరాజు, కామశి గణేష్, రామచంద్ర డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో చేనేత పరిరక్షణ సదస్సును నిర్వహించారు. వారు మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తివేయాలన్నారు. నేతన్నలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేయాలన్నారు. సంఘ నాయకులు యం.రామచంద్ర, మాచాని రఘు, అల్‌ఫ్రెడ్‌రాజు, ఏసేపు ప్రసాద్ పాల్గొన్నారు.

3న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

కోసిగి: ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాస ఉత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో ఈనెల 3న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్స్ ఆనంద్, రామాంజిని, దేవాలు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి రూ.20వేలు, ద్వితీయ బహుమతి వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ రూ.10వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడకారులు ఈనెల 2వ తేదీలోగా ఎంట్రీ ఫీజు రూ.1000 చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 63034 90195, 91827 08760 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నాటుసారా స్థావరంపై దాడులు

ఆదోని రూరల్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నవదోయం 2.0లో భాగంగా గురువారం మండలంలోని ఇస్వీ చెరువులో నాటుసారా స్థావరంపై దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. దాడుల్లో 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టణంలోని బోయగేరికి చెందిన బోయ చిన్నరంగాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే నాటుసారా కేసుల్లో పట్టుబడిన పాత నేరస్తులు బోయగేరికి చెందిన బోయ ఈరన్న, వాల్మీకి రాములను, నాటుసారా కేసులకు సంబంధం ఉన్న బెల్లం వ్యాపారస్తులు ఓబులేష్, గురురాజులను ఆదోని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరిగిందన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో పని చేస్తూ ఇటీవల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన ఫయాజుద్దీన్, రవి, గిరిబాబు, ఉరుకుందప్పలను గురువారం పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున ఆధ్వర్యంలో తోటి ఉపాధ్యాయులు సన్మానించారు.